www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 26 నవంబర్ 2025

5

తిరుపతి

సిఐడి విచారణకు కరుణాకర్‌రెడ్డి హాజరు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

పరకామణి దొంగతనం కేసులో సిఐడి విచారణకు టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం హాజరయ్యారు. సిఐడి విచారణకు హాజరు కావాలని అధికారులు ఇచ్చిన నోటీసులు అందుకున్న ఆయన, పద్మావతి అతిథి గహంలో జరుగుతున్న విచారణకు మంగళవారం సాయంత్రం హాజరై, అధికారుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం పద్మావతి అతిథి గహం ముందర ఆయన మీడియాతో మాట్లాడుతూ నాకు ఈ కేసుకు భూమికి, నక్షత్ర మండలానికి ఉన్నంత వ్యత్యాసం ఉందన్నారు. నన్ను ఈ కేసులో ఇరికించాలని నారా లోకేష్, బీఆర్ నాయుడు, వర్ల రామయ్య, భానుప్రకాశ్, పట్టాభిలు దుష్టచతుష్టయాలు నన్ను కచ్చితంగా విచారణ చెయ్యాలని అధికారులపై వత్తిడి చేసారని పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించి విచారణకు హాజరయ్యానని తెలిపారు.

కార్వేటినగరం, వెదురుకుప్పంలను తిరుపతిలో కలుపుతామని

ఇద్దరూ.. ఇద్దరే..! మాట తప్పారు..!

లోకేష్, చంద్రబాబుపై గుర్రు

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ (ఫైల్)

బాదుడే బాదుడులో.. చంద్రబాబు (ఫైల్)

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో ఏ ప్రాంతానికీ న్యాయం జరగలేదు.. నియోజక వర్గంలోని మండలాలను ఇతర జిల్లాల్లో కలపడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. తిరుపతికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో కాకుండా చిత్తూరు జిల్లాలో కలిపారు. ఇదేనా భౌగోళిక ప్రాధాన్యత.. ' అంటూ చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా 'బాదుడే బాదుడు' కార్యక్రమంలో కార్వేటినగరంలో జగన్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. తమ మనస్సులో మాటను వ్యక్తపరిచన చంద్రబాబుకు ఆ రెండు మండలాల్లో గణనీయంగా ఓట్లు కురిపించాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. జీడీనెల్లూరు, కార్వేటినగరం మండలాలు తిరుపతి జిల్లాలో కలిసిపోతున్నాయని ప్రచారం జరిగింది. కూటమి నేతలైతే తమ నాయకుడు మాటకు కట్టుబడి ఉన్నారని, త్వరలోనే తిరుపతిజిల్లా వాసులం కాబోతున్నామని ప్రచారం చేశారు. తీరా జీడీనెల్లూరు నియోజకవర్గం మొత్తాన్ని చిత్తూరు జిల్లాలోనే ఉంచారు. అయితే అధికారులు మాత్రం తిరుపతి జిల్లాలో రెండు మండలాలు కలవవని, నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట తిరుపతికి వెళ్లిన నేపథ్యంలో నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లాలో కలిపేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఈ రెండు మండలాలు జీడీనెల్లూరు నియోజకవర్గంలోనే, చిత్తూరు జిల్లాలోనే ఉంటాయని చెబుతున్నారు. వెదురుకుప్పం మండలంలోని రెవెన్యూ అధికారిని 'ప్రజాశక్తి' పలకరించగా చిత్తూరు జిల్లాలోనే ఈ రెండు మండలాలు ఉంటాయని, తిరుపతిలో కలిసే అవకాశం లేదని ఖరాకండిగా తేల్చి చెప్పారు. ఇక ఈ రెండు మండలాలు తిరుపతి జిల్లాలో కలవవని తెలుసుకున్న ఆ రెండు మండలాల ప్రజలు కూటమి ప్రభుత్వంపై గుర్రుమంటున్నారు. పై చదువుల్లోనూ, టిటిడి ఇతర సంస్థల్లో ఉద్యోగావకాశాల్లోనూ లోకల్‌గా రిజర్వేషన్ వర్తించేదని, కలపకపోవడం వల్ల తాము నాన్‌లోకల్‌గా మిగిలిపోతామని యువతలో బలమైన అభిప్రాయం ఉంది. ఏదిఏమైనా చంద్రబాబు, నారా లోకేష్ తమ ప్రాంతానికి ఇచ్చిన హామీని విస్మరించారని జనం తిట్టిపోస్తున్నారు.

ఆధ్యాత్మిక తన్మయత్వంతో అమ్మవారి పంచమి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఆధ్యాత్మిక తన్మయత్వంతో పంచమి (చక్రస్నానం) సాగింది. అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, లక్షలాది మంది భక్తుల సమూహంలో అమ్మవారి పంచమీతీర్థ మహోత్సవం వైభవోపేతంగా జరిగిందన్నారు. వేలాదిమంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించినట్లు చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడిలోని అన్ని విభాగాలు పటిష్టమైన ఏర్పాట్లు చేసి, విజయవంతంగా జరిగాయన్నారు. అన్ని విభాగాల అధికారులు, భద్రతా సిబ్బంది, పోలీసులు, శ్రీవారి సేవకులు, పారిశుద్ధ్య కార్మికులు విశేషంగా కషి చేశారని వారిని అభినందించారు. అంతకుముందు ఉదయం శ్రీ పద్మావతి అమ్మవారు పల్లకీలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. అనంతరం అమ్మవారికి ఆస్థానం నిర్వహించి ఉత్సవర్లను ఊరేగింపుగా పంచమీతీర్థ మండపానికి వేంచేపు చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద తెల్లవారుజామున 4.30 గంటలకు బయలుదేరిన సారె ఉదయం 11 గంటలకు తిరుచానూరు అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అర్చకులు పంచమి తీర్థ మండపంలో సారెను అమ్మవారికి సమర్పించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

అమ్మవారికి శ్రీవారి కానుక పద్మావతి అమ్మవారి పంచమీ తీర్థం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారు కానుకలు పంపారు. రూ.1.31 కోట్లు విలువైన 1.14 కిలోల బరువు గల బంగారు కమలముల హారం, వజ్రాల అడ్డిగ నగ, సారెతో పాటు తిరుపతి పురవీధులలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. శోభాయమానంగా సిరులతల్లికి స్నపనతిరుమంజనం పంచమీ తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు ఉదయం వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన కుంకుమపువ్వు, పైనాపిల్, డ్రై ఫ్రూట్స్, రెడ్, ఎల్లో రోజాపెటల్స్, వట్టివేరు, తులసిమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. పంచమి తీర్థం సందర్భంగా పంచమి మండపం వద్ద ఒక టన్ను పుష్పాలతో ఏర్పాటు చేసిన మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో తామర పూలు, రోజాలు, లిల్లీలు తదితర సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్ తో గార్డెన్ సిబ్బంది అత్యంత నందరంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం 12.10 నుండి 12.20 గంటల మధ్య పంచమి



తీర్థం(చక్రస్నానం) ఘట్టం ఘనంగా జరిగింది. రాత్రి 10 నుండి 11 గంటల వరకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని, పలువురు బోర్డు సభ్యులు ఎన్. సదాశివరావు, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నరేష్ కుమార్, ఎం.శాంతారామ్, జానకి దేవి, అనుగోలు రంగశ్రీ, ఎక్స్ అఫిషియో మెంబర్ సి.దివాకర్ రెడ్డి, జెఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్‌వో మురళీకష్ణ, ఎస్పీ ఎల్ . సుబ్బరాయుడు, సిఈ సత్యనారాయణ, ఎఫ్ ఏ అండ్ సీఏవో బాలాజీ, డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

1.50 లక్షల మందికి అన్నప్రసాదాలు, అల్పాహారం

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి పంచమితీర్థ మహోత్సవం సందర్భంగా టిటిడి అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో 1.50 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలు, అల్పాహారం అందించారు. భక్తుల సౌకర్యార్థం 160 కౌంటర్లలో తోళప్ప గార్డెన్స్‌లో 50, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద 40, శ్రీ అయ్యప్పస్వామివారి ఆలయం వద్ద 50, పూడి వద్ద 20 అన్నప్రసాదం కౌంటర్లలో 24వ తేదీ రాత్రి నుండి 25వ తేదీ ఉదయం, మధ్యాహ్నం వరకు కదంబం, చక్కెర పొంగలి, దద్దోజనం, పులిహోర, ఉదయం ఉప్మా, పొంగలిని విరివిగా అందజేశారు. పంచమి తీర్థం కోసం శ్రీ పద్మావతీ అన్నప్రసాద కేంద్రం, శ్రీనివాసం కాంప్లెక్స్, టిటిడి పరిపాలనా భవనంలోని ఎంప్లాయిస్ క్యాంటిన్ ల నుండి 13 బాయిలర్స్ ద్వారా వంటలను తయారు చేసి హోల్డింగ్ పాయింట్లు, గ్యాలరీలు, క్యూలైన్లు, భక్తులు అధికంగా ఉండే కూడళ్ల వద్ద పంపిణీ చేశారు. వంటలలో నాణ్యత, రుచి, శుచి మరింత మెరుగ్గా ఉండేందుకు జీడిపప్పు, నెయ్యిని అదనంగా ఉపయోగించారు. 1.25 లక్షల మందికి బాదంపాలు, లక్షమందికి బిస్కెట్ ప్యాకెట్లు, 30వేల మందికి మజ్జిగ, 30 వేల మందికి సుండలను అందజేశారు. 1.50 లక్షల తాగునీటిబాటిళ్లను పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాల్లో రోజుకు 300 మంది, పంచమితీర్థం రోజున 600 మంది పారిశుద్ధ్య సిబ్బంది సేవలందించారు. టిటిడి ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాటన్ మిల్లు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎంపీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతి కాటన్ మిల్లు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు ఎంపీ గురుమూర్తిని మంగళవారం కలిసి తమ సమస్యలను వివరించారు. మిల్లు మూతపడిన తర్వాత తమకు రావాల్సిన జీతాలు, పీఎఫ్, గ్రాట్యూటీ వంటి బకాయిలు ఇంకా చెల్లించకపోవడం వలన తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. 1997 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటివరకు గ్రాట్యూటీ చెల్లించలేదని, 110 మంది శాశ్వత ఉద్యోగులకు గత 10 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని ఎంపీకి వివరించారు. అలాగే పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పూర్తి గ్రాట్యూటీ ఇవ్వలేదని, వారికి కేటాయించిన క్వార్టర్లు శిథిలావస్థలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను మరోసారి పార్లమెంట్ వేదికగా బలంగా వినిపించి, ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి వారికి హామీ ఇచ్చారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- రేణిగుంట

రేణిగుంట ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యర్యంలో మంగళవారం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీ బి వ్యాధి గ్రస్థులకు నిత్యావసర వస్తువులు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. తిరుపతి జిల్లా వైద్యధికారి డాక్టర్ బాల కష్ణ నాయక్ ముఖ్య అతిథి గా పాల్గొని రోగులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతా టీబి వ్యాధిగ్రస్థులకు నిత్యావసర వస్తువులు, పౌష్టికహారం కిట్లను ఆషా సంస్థ అందచేయడం అభినందనీయమన్నారు. మనోధైర్యం ఉంటే వ్యాధి త్వరగా నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమం లో ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి, ఎంపిహెచ్ఎస్ కామరాజు, టీబీ సూపర్వైసర్ సుమశ్రీ లక్ష్మి పాల్గొన్నారు.

సిఆర్ఎస్ కార్మికులకు ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి - రేణిగుంట

కార్మికులు పనిచేస్తున్న సమయంలో అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించే విధంగా ప్రథమ చికిత్స పై అవగాహన కలిగి ఉండాలని క్యారేజ్ రిపేర్ షాప్ (సిఆర్ఎస్) చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక క్యారేజ్ రిపేర్ షాప్ తిరుపతిలో సిడబ్ల్యూఎం శ్రీనివాస్, డిప్యూటీ సీఎంఈ ప్రమోద్ ఆదేశాల మేరకు సివిల్ డిఫెన్స్ ఇన్స్ట్రక్టర్ జావిద్ అహ్మద్, జె.ఈ చంద్రశేఖర్, సివిల్ డిఫెన్స్ టీం ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ, రిస్క్యూ మెథడ్స్ పై అవగాహన కోసం మాక్ డ్రిల్ నిర్వహించారు. సేఫ్టీ ఆఫీసర్ హిమ సాగర్ పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి ఆర్యవైశ్యుల విరాళం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తాత్యయగుంట గంగమ్మ ఆలయానికి ఆర్యవైశ్య సంఘం ఆరులక్షల వెయ్యిన్ని నూట పదహారు రూపాయలు విరాళం అందించింది. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా పాలకమండలి చైర్మన్ మహేష్ యాదవ్ కు చెక్కును ఆర్యవైశ్య సంఘం నేతలు దిండుకుర్తి నరసింహులు అందించారు. అమ్మవారి ఆలయ విస్తరణ కోసం స్థలం కొనుగోలుకు తమ ఆర్యవైశ్య సంఘం తమ వంతుగా ఆరు లక్షల విరాళం అందించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు సుకుమార్, రమేష్ పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌పై ఎస్‌డబ్ల్యుఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఏలూరు డిపోలో జరిగిన డీజిల్ కేసులో విచారణ చేపట్టకుండా, ఏలూరు డిపో నుంచి ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏలూరు డిపిటిఒ ఆఫీసులో పనిచేస్తున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ అసిస్టెంట్ సిహెచ్ సుందర్‌రావును సస్పెండ్ చేశారు. ఇది అక్రమ సస్పెన్షన్ అని ధ్వజమెత్తారు. రాష్ట్ర పిలుపులో భాగంగా తిరుపతి జిల్లాలోని ఏడు డిపోలలో నిరసనలు జరిగాయి. రూ.82 లక్షల రూపాయల కుంభకోణం కేసును పూర్తిస్థాయిలో విచారించాలని, ప్రైవేట్‌కు ఇచ్చిన పెట్రోల్ బంకు విషయంలో మోసం జరిగిందని, కొంతమంది వద్ద యాభై లక్షల రూపాయలు వసూలు చేసి, మిగతా నలుగురి వద్ద డబ్బు ఇవ్వాలని అడిగితే, ఆ నలుగురు ఉద్యోగులు ఇవ్వనందున సస్పెండ్ చేశారన్నారు.

నిజనిర్ధారణ చేసేందుకు ప్రభుత్వం విచారణ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు పరశురాం, భాస్కర్, శివకుమార్ పాల్గొన్నారు.

గూడూరుకు నిబద్ధత గల సిఐ కావలెను ?

ప్రజాశక్తి - తిరుపతి సిటి

గూడూరు ఒకటవ పట్టణ సర్కిల్ కార్యాలయానికి నిబద్ధత గల సర్కిల్ ఇన్స్పెక్టర్ కావాలని పట్టణ ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ సిఐ విధుల్లో లేకపోవడం, ఇద్దరు ఎస్ఐ లు ఉంటే కేవలం ఒక్కరే పర్యవేక్షిస్తుండడంతో పనిభారంతో సతమతమవుతున్నారు. ఒకపక్క ట్రాఫిక్, మరో పక్క రాత్రి పూట గస్తీ కి కింద స్థాయి సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తూ పని భారాన్ని మోస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారి దష్టి సారించి గూడూరు పట్టణానికి నిబద్ధత , విధి నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చే అధికారిని త్వరిత గతిన నియమించాలని పట్టణ ప్రజలతో పాటు, పోలీస్ సిబ్బంది కోరుకుంటున్నారు.

ఎల్ఆర్ఎస్, బిపిఎస్ త్వరగా పరిష్కరించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎల్ఆర్ఎస్, బిపిఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, లేఔట్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బిపిఎస్ ద్వారా ప్రజలకు అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. నగరంలో రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా నిత్య పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎసిపిలు మూర్తి, మధు, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురవారెడ్డి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

ఏపీ ఎస్ఈబి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా పెద్దయ్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఏపీఎస్ఈబి ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ డిస్కౌంట్ యూనిట్ అధ్యక్షులుగా పెద్దయ్య ఎన్నికయ్యారు. ఆ సంఘం డిస్కం ఎన్నికలను అసోసియేషన్స్ సర్వసభ సమావేశం సందర్భంగా శనివారం ఎన్నుకున్నారు. ఇందులో డిస్కో అధ్యక్షుడుగా పెద్దయ్య, కార్యదర్శిగా జయరామయ్య ఎన్నికయ్యారు, నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యదర్శులను ఆ సంఘం నాయకులు, ఉద్యోగులు గజమాలతో సత్కరించారు.

హోటల్ మేనేజ్మెంట్ కళాశాల ఉద్యోగులకు పెండింగ్ జీతాలివ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలో రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ నిర్వహిస్తున్న స్టేట్ హోటల్ మేనేజ్మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అప్లైడ్ న్యూట్రిషన్ శిక్షణ కళాశాలలో ఔట్సోర్సింగ్ కింద నియమితులైన నాన్ టీచింగ్ సిబ్బందికి గత 23 నెలలుగా జీతాలు లేక ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. వీరికి తక్షణం పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షకు సిఐటియు మద్దతు తెలిపింది. గత 11 రోజులుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో ప్లకార్డులు పట్టుకొని పెండింగ్ జీతాలు ఇవ్వాలని నిరసన తెలియజేస్తున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం, సిఐటియు ఉపాధ్యక్షులు కే వేణుగోపాల్ మాట్లాడుతూ రెండేళ్లుగా అవుట్సోర్సింగ్ సిబ్బందికి జీతాలు లేక నాన్ టీచింగ్ స్టాఫ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీరి సమస్యల పట్ల కళాశాల ప్రిన్సిపల్ ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఇది సరైన విధానం కాదని ప్రశ్నించారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారావారిపల్లి విచ్చేసిన సందర్భంగా కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతులు ఇచ్చిన నేటికీ వీరి సమస్య పరిష్కరిష్కరించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 40 మంది నాన్‌టీచింగ్ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియమించారని, జీతాలు చెల్లించకపోవడంతో దాదాపు 20 మందికి పైగా ఉద్యోగాలు వదులుకుని వెళ్లిపోయారని అన్నారు. చాలీచాలని వేతనాలతో 13 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నరేష్, శ్రీనివాసులు, త్యాగరాజులు, హమీద, వాణి, నాగరాజు, జ్యోత్స్న, రమాదేవి, ప్రమీల, మున్నా, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

జింగిలిపాలెం దళితులకు భూములు పంచాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని జింగిలిపాలెం దళితులకు భూములు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో దళితులతో కలిసి ప్రభుత్వ భూమిలో ఎర్ర జెండాలు నాటారు. నారాయణపురం రెవెన్యూ, సర్వే నంబర్ 465లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని గత పదిహేనేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారని పుల్లయ్య తెలిపారు. అయితే సాగు పట్టాలివ్వడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉంటే దళితులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు కొందరు స్థానికేతరులకు పట్టాలిచ్చినట్లుగా తెలిసిందన్నారు. రెవెన్యూ అధికారులకు స్థానికేతరులపై ఉన్న ప్రేమ సాగుదారులపై ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు. స్థానికేతరులకు ఇచ్చిన పట్టాలను తక్షణమే రద్దు చేసి స్థానిక దళితులకు భూమి పంచకుంటే భూ పోరాటం తప్పదని హెచ్చరించారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, స్థానికులు ఈశ్వర్, మోహన్ కష్ణ, శంకరయ్య, హరీష్, వెంకట్రామయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో హై డిఫినిషన్ టిడిసిఎస్ చికిత్సలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్విమ్స్ సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో 25వ తేది నుండి హై డిఫినిషన్ టిడిసిఎస్ (ట్రాన్స్ క్రాణియల్ డైరెక్ట్ కరెంటు స్టిములేషన్) ద్వారా ఆత్యాధునిక చికిత్సలు ప్రారంభించినట్లు స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ . సైకియాట్రీ విభాగం వారి ఆధ్వర్యంలో హై డిఫినిషన్ టి.డి.సి.ఎస్.అనే అత్యాధునిక పద్ధతిలో, మెదడు నాడీకణాలపై తక్కువ మోతాదులో విద్యుత్ ప్రవాహాన్ని, అత్యంత ఖచ్చితమైన మానిటరింగ్‌తో అందించే నాన్-ఇన్‌వేసివ్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ టెక్నిక్‌గా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్ట మొదటి సారిగా స్విమ్స్ సైకియాట్రీ విభాగంలో ఈ చికిత్సను ప్రవేశ పెట్టామని, దీనిని మానసిక పేషంట్లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ గణేష్ కుమార్ మాట్లాడుతూ మానసిక రోగుల కోసం హై డెఫినిషన్ టీడీసీఎస్ ఆత్యాధునిక చికిత్సను సైకియాట్రీ విభాగంలో ప్రారంభించామని తెలిపారు. స్విమ్స్ ఆసుపత్రిలో హై డెఫినిషన్ టీడీసీఎస్ అత్యాధునిక మానిటరింగ్ సిస్టమ్‌తో, సైకియాట్రిస్టులు మానిటరింగ్ చేస్తూ, ప్రత్యేకమైన చికిత్స గదిలో నుంచి చికిత్సను అందించబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

ఘనంగా 'ఆర్కాట్ ' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి అనంత వీధి కూడలిలో జనసేన నేత, లయన్స్ క్లబ్ అధ్యక్షులు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ జన్మదిన వేడుకలను అనుచరులు , అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు వారి గహంలో ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. తరువాత వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల మధ్యలో కేక్ కట్ చేసి గజమాల, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ అనే నినాదంతో సమాజసేవలో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి. ఆర్. చంద్ర, మస్తాన్, మురుగమ్మ, శేషాద్రి, వెంకటేష్ బాబు, సతీష్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గోపీనాథ్ నాయుడు, సాంబశివారెడ్డి పాల్గొన్నారు

వందేభారత్‌కు అదనపు బోగీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుమల వెళ్లే శ్రీవారి భక్తుల కోసం రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్‌– తిరుపతి మార్గంలో వందేభారత్ రైలు బుధవారం నుంచి 20 బోగీలతో పరుగులు పెట్టనుంది. ఇప్పటి వరకు 2 ఎగ్జిక్యూటివ్ క్లాస్, 14 ఏసీ చైర్‌కార్లతో కలిపి మొత్తం 16బోగీలతో నడుస్తుండగా, అదనంగా మరో 4 ఏసీ చైర్‌కార్లను శాశ్వత ప్రాతిపదికన జత చేయాలని దక్షిణ మధ్య రైల్వేనిర్ణయించింది. దీంతో మరో 312 సీట్లు ప్రయాణికులకు అందుబాట్లోకి రానున్నాయి. ఈ రైలు మంగళవారం మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విజయవాడ టు బెంగళూరు వయా తిరుపతి మరో వందేభారత్ వచ్చే నెల నుంచి పట్టాలెక్కనుంది. ఈ రైలు అందుబాటులోకి వస్తే విజయవాడ నుంచి తిరుపతికి నాలుగున్నర గంటల్లోనే చేరుకునే అవకాశం ఉంది. అదే విధంగా విశాఖ నుంచి తిరుపతికి వందేభారత్ ఏర్పాటు కోసం డిమాండ్ ఉన్నా.. దూరం కారణంగా వందేభారత్ స్లీపర్ ఈ మార్గంలో ఖరారు చేస్తామని.. ఇందుకు మరింత సమయం పడుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి

■ సిపిఎం సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్ధన్

ప్రజాశక్తి - సత్యవేడు : సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సిపిఎం సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాల పునర్విభజన చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఒక నియోజకవర్గాన్ని ఒకే రెవెన్యూ డివిజన్లో ఉంచాలనే ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కానీ సత్యవేడు నియోజకవర్గం రెండు డివిజన్లలో ఉండడంవల్ల ప్రజలు, రాజకీయ నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సమస్యలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కావున సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

చెకుముకి పోటీల్లో విజేతలు.. చెన్నూరు విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరుపతి సైన్స్ సెంటర్లో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలలో చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తరుణ్, ఆదిత్య, వహీద్ అహ్మద్‌లు మొదటి బహుమతి గెలుచుకున్నారని గూడూరు జే.వి.వి. ఉపాధ్యక్షులు చెంచు నారాయణ, నాగరాజులు తెలిపారు. గూడూరు జనవిజ్ఞాన వేదిక సభ్యులు చెన్నూరు బాలుర పాఠశాలకు వెళ్లి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి. గౌరవ అధ్యక్షుడు పురుషోత్తమరావు, చెంచు నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెంచయ్య, షఫీలకు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, డైరెక్టర్ మహ్మద్ షఫీలను హిందుస్థాన్ స్టీల్స్ అండ్ సిమెంట్ అధినేత షేక్ ఇలియాజ్ బాబు మంగళవారం ఘనంగా సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు. ఒక ముస్లిం మైనారిటీ నాయకుడికి స్థానం కల్పించడంపై స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గ పరిధిలోని రైతుల సంక్షేమం, అభివృద్ధికి మార్కెట్ కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. షాకీర్ అలీ, రఫీ, అబ్బుల్ హమీద్ అలీ, బషీర్, బషీర్ అహ్మద్, సాజిద్, సి ఎస్ మస్తాన్, అర్షద్, వెంకటేశ్వర్ చౌదరి, పాండు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా నిరంతర ప్రక్రియ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరిలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుండి భారీ స్పందన వచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. జాబ్ మేళా నిర్వహణలో భాగస్వామ్యమైన కంపెనీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయంసి చైర్మన్, పట్టణ అధ్యక్షులు, రాష్ట్ర చేనేత డైరెక్టర్, మాజీ ఎయంసి ఛైర్మన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు, కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తెలుగుదేశం కార్యాలయంలో మంగళవారం ఉదయం తెలుగుదేశం మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాకారం చేస్తున్న సందర్భంగా నూతన గృహాలకోసం అర్హులైన లబ్ధిదారులు ఈనెల 30 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సచివాలయంలో ఉపాధి హామీకార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ తీసుకుని వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్టీలకు 2,75,000 రూపాయలు, ఎస్సీలకు రెండు 1,50,000 రూపాయలు, ఓసీలకు 2,00,000 రూపాయలు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఉపాధి హామీలో ఉన్నవారికి కొంత బడ్జెట్, వెలుగు సంఘాల గ్రూపుల్లో ఉన్నవారికి అదనంగా 50 వేల రూపాయలు ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అనంతపురం పురపరిపాలన శాఖ ప్రాంతీయ సంచాలకులు ఆర్.నాగరాజుని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ డి.వి. నాగేశ్వరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుత్తూరు పురపాలక సంఘ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజావసరాల సదుపాయాల పెంపు, పట్టణ శుభ్రత, మౌలిక వసతుల పురోగతి వంటి అంశాలపై కమిషనర్ వివరాలు అందజేశారు. పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసే దిశగా పరస్పర చర్చలు జరిగాయి.

ఆరోగ్య అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండలంలోని సిటిఆర్ నేత్తం గ్రామంలో పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులో మంగళవారం ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శోభన్ బాబు ఎయిడ్స్ వ్యాధి గురించి తెలియజేసి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. తర్వాత డాక్టర్ శోభన్ బాబు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఊరిలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, అందరూ శారీరిక శ్రమ చేయాలని, పొగాకు మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎన్ఎస్–ఎస్ వాలంటీర్లు, ఆశా వర్కర్లు గ్రామంలో ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కే.శ్రీనివాసులు, వి.బాబురావు, ఆశా వర్కర్లు విద్య, అలిమేలు, కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ పూర్తి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, రామచంద్రాపురం: రామాపురం డంపింగ్ యార్డులోని చెత్త నిర్వహణ గడువులోపు పూర్తి చేయాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. రామాపురం వద్దనున్న లెగసీ వేస్ట్ డంపింగ్ యార్డును మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు లెగసీ వేస్ట్‌ను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్ట సంస్థ ప్రతినిధులు, అధికారులు కలసి త్వరగా చెత్త నిర్వహణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో 2,21,000 మెట్రిక్ టన్నుల చెత్తను నిర్వహణ చేశారని తెలిపారు. రెండవ దశలో 65000 మెట్రిక్ టన్నుల చెత్త నిర్వహణను డిసెంబర్ 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ రమణ, చెత్త నిర్వహణ ప్లాంట్ నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

చెత్త నిర్వహణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - నాయుడుపేట: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని సూళ్లూరు పేట ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం పెళ్లకూరు మండలం, రావులపాడులో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతన్నా–మీకోసం" కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి రైతు ఇంటింటికీ వెళ్లి రైతన్నా–మీకోసం కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలు వాటి ప్రయోజనాలు, రైతు కుటుంబాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలను వివరించారు. నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గఇన్‌చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటి మార్చే దిశగా పనిచేస్తుందన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేయడం వలన అధిక దిగుబడులు రాబట్టవచ్చని తెలియజేశారు. నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందించాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణ రెడ్డి, టీడీపీ నాయకులు రమేష్ నాయుడు, వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు,రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలుగు ప్రశ్నావళి పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మార్చి 16 నుండి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధన కోసం ఈ ఏడాది స్వల్పంగా మారిన తెలుగు ప్రశ్నాపత్రం ఆధారంగా తాము రూపొందించిన మెటీరియల్‌ను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు వాణి చేతుల మీదుగా ఉచితంగా అందించినట్లు పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ స్థాయిల విద్యార్థులను పరిగణలోకి తీసుకుని మెటీరియల్‌ను రూపొందించామని తెలిపారు.విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ బాబు, లక్ష్మయ్య, దాసు, సుజన, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్ బాబు సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాలు మేరకు, అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం, మండల న్యాయ సేవా అధికారి సంస్థ ఆదేశాలు ఆధ్వర్యంలో, స్థానిక కామరాజు నగర్ అంగన్వాడి కేంద్రం ఆవరణంలో మంగళవారం మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సురేష్ బాబు మాట్లాడుతూ స్త్రీలు రాజ్యాంగం కల్పించిన హక్కులు తెలుసుకోవాలని, వాటి ద్వారా రక్షణ పొందాలని తెలిపారు. అనంతరం న్యాయవాది. అనురాగిణి మాట్లాడుతూ గృహహింస నిరోధక చట్టం, వరకట్నం దురాచార చట్టం, భ్రూణ హత్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రతి మహిళా చైతన్యం మార్పు కోసం ముందడుగుతో మహిళా ఉద్యమంగా లింగ వివక్షతను రూపుమాపాలని ఏపిఎం ధనంజయ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినం సందర్భంగా నారాయణవనం మహిళా సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాలుగు వారాలపాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ బేబీ రాణి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, పౌష్టిక ఆహారం ఆవశ్యకతను తెలియజేసారు. కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌ను అందరూ వీక్షించారు. అనంతరం ఎంఎస్ కార్యాలయం నుండి బైపాస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టారు.

ప్రజాశక్తి - వెంకటగిరి: అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని వెంకటగిరి, ఐసిడిఎస్ కార్యాలయంలో వెంకటగిరి జడ్జి విష్ణువర్ధ సూచనల మేరకు మంగళవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వెంకటగిరి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ప్యానల్ లాయర్ అద్దంకి గాంధీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డి.ఆర్.డబ్ల్యు మహిళా కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో, 7వ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్ కుమార్ అధ్యక్షతన సమాజంలో స్త్రీ ప్రాముఖ్యత, చట్టాలను గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కోటేశ్వరరావు, అడ్వకేట్స్ అరవ పార్వతయ్య, మహబూబ్ భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ఉదయం జెండర్ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి జెండర్ ప్రచార కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా డిల్లీ నుండి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ వారు నయా చేతన 4.0 కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఎవరైనా వివక్షకు గురైతే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మహిళలు ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఏపియం మునెయ్య మాట్లాడుతూ డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పనిచేయాలని కోరారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న హింస, ఆన్లైన్ మోసాల పట్ల మహిళలు మౌనాన్ని వీడి జాగరుకతతో అప్రమత్తంగా ఉండాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం సీనియర్ ఆచార్యులు నీరజా సూచించారు. ఇంటర్నేషనల్ డే ఫర్ ద ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ అగెనెస్ట్ ఉమెన్ సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 3, 11 ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేరూరు మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, బైరాగి పట్టెడ ఆర్చ్ వద్ద ఉన్న ప్రభుత్వ బిసి హాస్టల్‌లోని కాలేజీ విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'అరుణ్ ఐస్‌క్రీమ్ డోనేట్ల' ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అరుణ్ ఐస్ క్రీములు అద్భుతమైన ఐస్ క్రీమ్ డొనేట్లను మంగళవారం ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈ సీజన్‌లో అరుణ్ ఐస్‌క్రీమ్స్, నిజమైన పాలు, క్రీమ్‌తో తయారు చేసిన ఐస్‌క్రీంల శ్రేణికి పేరుగాంచిన కాసాటా స్టైస్, ఐకోన్, ఐబార్, స్పైరల్, బైట్స్, బాల్ ఐస్‌క్రీం, ఐస్‌క్రీం శాండ్‌విచ్, పుషప్ కాటన్ క్యాండీ వంటి ఐకానిక్ ఉత్పత్తులతో పాటు, దాని ప్రియమైన విందుల శ్రేణికి కొత్త చేరికగా అరుణ్ ఐస్‌క్రీమ్ డోనట్ను పరిచయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ తాజా ఆవిష్కరణ ఐస్‌క్రీమ్‌ల ప్రపంచానికి ఉత్సాహభరితమైన కొత్త మలుపును అందిస్తోంది. రిఫ్రెష్‌గా, ఉల్లాసభరితంగా, పూర్తిగా ఆస్వాదించదగినదాన్ని కోరుకునే వినియోగదారులను ఆకర్షించేందుకు రూపొందించిన ఈ చిన్న బైట్–సైజు ఆనందం సరదా మరియు రుచికరమైన అనుభూతిని కలిపి అందిస్తుంది. అరుణ్ ఐస్‌క్రీమ్స్ నుండి ఇటీవలి ప్రయోగం అన్ని వయసుల వారిని ఆకర్షించే క్లాసిక్ ట్రీట్స్‌ను పునఃరూపకల్పన చేయడం, కొత్త క్రాఫ్టింగ్ అనుభవాలను అందించడంలో నిబద్ధంగా ఉందని తెలిపారు.

వేద సంగోష్టిలో కృష్ణమూర్తి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీలాల్ బహుదూర్ శాస్త్రి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వారు ఢిల్లీలో నిర్వహించిన, జాతీయ వేద సంగోష్టి సదస్సుకు శృంగేరి శారదా పీఠం, జగద్గురు శంకరాచార్య మూల మహాసంస్థానం కనిష్ఠ పీఠాధితులు పూజ్యశ్రీ విధుశేఖర భారతి మహాస్వామీజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస వరఖేడీ, శ్రీలాల్ బహదూర్ శాస్త్రి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మురళీమనోహర్ పాఠక్‌లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శారదా పీఠం కనిష్ఠ పీఠాధిపతులు విధుశేఖర భారతి మహాస్వామీ మాట్లాడుతూ సంస్కృతం మృతభాష కాదని, ప్రపంచంలోని అన్ని భాషలకు ప్రాణభూత భాష అని, వేదముల ఔన్నత్యాన్ని, సంస్కృత భాష గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథి ఎస్ఎస్కె వైస్–చాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ శాస్త్ర పరిరక్షణ, సనాతన ధర్మ సంరక్షణ జగద్గురు శ్రీ శృంగేరి శారదా పీఠం ద్వారా జరుగుతుందని, ఈరోజు జగద్గురు శంకరాచార్యుల మహాస్థాన కనిష్ఠ పీఠాధిపతులు పూజ్యస్వామీజీని ప్రత్యక్షంగా స్వాగతించడం మహాదృశ్యంగా భావిస్తున్నానని తెలిపారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ముంపు గ్రామాల్లో సాధారణ పరిస్థితి నెలకొనే విధంగా బాధిత కుటుంబాలను అన్నీ విధాలుగా ఆదుకుంటా మని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భరోసా ఇచ్చారు. మంగళవారం పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్, మినీ ఆడిటోరియం నిర్మాణానికి నిధులు సమకూర్చాలని నింద్ర మండలం ఎమ్.ఎస్.వి.యం పురంలోని అమ్మయప్పర్ గార్మెంట్స్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే కోరారు. వారు అంగీకారం తెలుపడంతో ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేవిబి పురం చేరుకొని ఎంపీడీఓ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయాలను తనిఖీ చేశారు. అక్కడ నుండి కెవిబి పురం జడ్పీ హైస్కూల్ కు చేరుకొని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తదుపరి బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. చివరగా కళత్తూరు చేరుకొని ముంపు బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఫ్యాన్, దుప్పట్లు, బల్బులు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, వాసు రెడ్డి, ఢిల్లీ బాబు, ప్రధానోపాధ్యాయుడు గిరి ప్రకాష్, గవాస్కర్ తదితరుల పాల్గొన్నారు.

దక్షిణ కాశీకి రింగు రోడ్డు అవసరం : ఎమ్మెల్సీ కావలి గ్రీష్మా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతగాంచిన శ్రీకాళహస్తిని మరింత ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కైలాసగిరుల మీదుగా రింగు రోడ్డు అవసరం ఉందని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మా అభిప్రాయపడ్డారు. రింగ్ రోడ్డు నిర్మాణానికి కావలసిన ఇంజనీరింగ్ ప్రతిపాదనను సిద్ధం చేసి పంపాలని ఎంజీఎం సంస్థకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ గ్రీష్మా కుటుంబ సమేతంగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఎంజీఎం గ్రాండ్ హోటల్ అతిథ్యమిచ్చింది. ఈ సందర్భంగా గ్రీష్మా ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్‌తో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యను అధిగమించేందుకు కైలాసగిరులపై దక్షిణ రింగ్ రోడ్డును ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో కలిసి రింగ్ రోడ్డు ప్రతిపాదన కార్య రూపం దాల్చేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కైలాసగిరుల్లో 1500 వందల ఎకరాలు చదునైన స్థలం ఉన్నదనీ, వసతి గృహాలు నిర్మిస్తే పదివేల మంది భక్తులు సేద దీరే అవకాశం ఉంటుందని మయూర్ తెలిపారు. అదేవిధంగా వెయ్యి మంది స్థానికులకు ఉపాధి కలుగుతుందన్నారు. రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆలయ భూముల విలువ రూ. 50 వేల కోట్లకు పెరుగుతుందని వివరించారు. ఎమ్మెల్సీ గ్రీష్మా తల్లి, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, భర్త శ్రీనివాస్, మరిది విష్ణు, ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున్ నాయుడు పాల్గొన్నారు.

తెలుగు గంగ నీరు విడుదల

ప్రజాశక్తి - బాలాయపల్లి : రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, పాశం సునీల్ కుమార్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సమీపంలోని తెలుగు గంగ 5 వ బ్రాంచ్ కెనాల్ ద్వారా మూడు నియోజకవర్గాలకు సరఫరా అయ్యే నీటిని ఎమ్మెల్యేలు విడుదల చేశారు.ఈ సందర్భంగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ తెలుగు గంగ నీటి విడుదల మూడు నియోజక వర్గాల రైతాంగానికి సాగునీటి భరోసా కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం 15 వేల క్యూసెక్కుల నీటిని తెలుగు గంగ ద్వారా పంటల సాగుకు విడుదల చేయడం జరిగిందన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు కుటుంబానికి చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలుస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ఏ గ్రామం, ఏ రైతు కూడా సాగునీటి కోసం ఎదురు చూడకుండా కూటమి ప్రభుత్వంలో సాగునీటి వనరులను రైతులకు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, సీసీ నాయుడు, ఆది వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నిరక్షరాస్యత అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, కావలివారిపల్లిలో, పాకాల పిఏసిఎస్ ఖాతాదారులకు, సంఘ సభ్యులకు సంఘ అధ్యక్షురాలు క్రిష్ణమనేని సావిత్రి ఆధ్